ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్టం : 30.0 కనిష్టం : 23.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 11 ఆగస్టు 2025

అటు కృష్ణమ్మ.. ఇటు తుంగభద్ర

● పీఏబీఆర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో



నీటితో కళకళలాడుతున్న పీఏబీఆర్

కూడేరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఓ పక్క కృష్ణమ్మ బిరబిరా పరుగులిడుతుంటే.. మరోపక్క తుంగభద్రమ్మ ఉరకలేస్తూ పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లోకి దూసుకు వస్తోంది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు 1855 క్యూసెక్కులు వస్తుండగా.. తుంగభద్ర డ్యాం నీరు లింక్ చానల్ ద్వారా 105 క్యూసెక్కులు పీఏబీఆర్‌లోకి వస్తుండడంతో నీటి మట్టం రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం 430.400 అడుగుల వద్దకు చేరుకొని, 2.924 టీఎంసీలు నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పీఏబీఆర్‌లోకి కృష్ణా జలాలు రాగా, లింక్ చానల్ నుంచి గత ఐదు రోజులుగా తుంగభద్ర నీరు వస్తుండటంతో పీఏబీఆర్ నీటితో కళకళలాడుతోంది.



బీటీపీలో నీటి నిల్వ

బీటీపీకి వరద

గుమ్మఘట్ట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులలో ఒకటైన భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)కి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. కర్ణాటక ప్రాంతాల్లో మూడురోజులుగా భారీ వర్షాలు పడుతుండడంతో వేదావతి నది వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. దీంతో బీటీపీకి వరదనీటి ప్రవాహం పెరుగుతోంది. 16.55 అడుగుల నీటి సామర్థ్యం గల ప్రాజెక్టులో గతంలో 16.41 అడుగుల నీరు నిల్వ ఉండేది. మూడు రోజులుగా వరద వస్తుండడంతో ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 16.48 అడుగులకు నీటి మట్టం చేరుకుందని అధికారులు తెలిపారు. 1500 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతోందని అధికారులు తెలిపారు. రెండు టీఎంసీల సామర్థ్యంగల ఈ ప్రాజెక్టుకు ప్రస్తుతం ఒక టీఎంసీ మేర వరదనీరు చేరినట్లు అధికారులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య 7

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం 7

సెక్టోరల్స్ నియామకానికి మరో అడుగు
● నేడు, రేపు టీచర్లకు ఇంటర్వ్యూలు 7

నరకప్రాయం..!

గర ప్రయాణం..

గుంతల రోడ్లతో వాహనదారుల బెంబేలు

ప్రధాన రహదారుల్లోనూ అదే దుస్థితి

చినుకుపడితే భయానకమే..



అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఏర్పడిన గుంతలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఏ రోడ్డుకెళ్లినా గుంతలే దర్శనమిస్తున్నాయి. మోకాలిలోతు గుంతల్లో ప్రయాణించాల్సి రావడంతో నడుములు విరుగుతున్నాయని నగరవాసులు వాపోతున్నారు. పలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. రోడ్లపై గుంతలు చాలవన్నట్లు స్పీడ్ బ్రేకర్లు విసుగు పుట్టిస్తున్నాయి. అవసరం లేని చోట్ల వేస్తున్నారు. ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ వేసేసుకుంటున్నారు. ఒక్కో రోడ్డులో పదుల సంఖ్యలో స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో వాహనదారులు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు.

ఏ దారికెళ్లినా గుంతలే..

అనంత నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో పైపులైన్ల కోసం గతంలో గుంతలు తీశారు. వాటిని పూడ్చడం మరచిపోయారు. దీంతో ద్విచక్రవాహనాలు, కార్లలో వెళ్లాలంటే ఆ గుంతల్లో దిగాల్సిందే. నగరంలో ఏ వీధిలోకి వెళ్ళినా గుంతలు తప్పవు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క గుంత కూడా పూడ్చిన పాపాన పోలేదు. కొత్త రోడ్డు కూడా వేయలేదు. ఐదేళ్లు (మిగతా 7లో..)



తాడిపత్రిలోని లక్ష్మీనారాయణ టాకీస్‌లోకి చేరిన నీరు

దంచికొట్టిన వాన

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షం

● తాడిపత్రిలో కుండపోత
● పొంగిపొర్లిన వంకలు, వాగులు
● తెగిన వంతెనలు
● కూలిన ఇళ్లు

తాడిపత్రి/అనంతపురం అర్బన్/పుట్టపర్తి రూరల్/కొత్తచెరువు/పెనుకొండ రూరల్/, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి, ఆదివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. తాడిపత్రి నియోజకవర్గంలో కుండపోతగా కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలుచోట్ల రోడ్లు తెగిపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పలు ఇళ్లు కూలడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

తాడిపత్రిలో వర్ష బీభత్సం

తాడిపత్రి మండలంలో భారీ వర్షం కురిసింది. బుగ్గ సమీపంలో తాడిపత్రి-నంద్యాల రోడ్డు తెగిపోవడంతో ట్రాఫిక్ కిలోమీటర్ల మేర స్తంభించింది. 4గంటలపాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం అధికారులు వాటిని పైపుల ద్వారా పూడ్చి (మిగతా 7లో...)



పరవళ్లు తొక్కుతున్న నిట్టూరు వంక

గోరంట్లలో భారీ చోరీ

● 150 గ్రాముల బంగారం, రూ.7.50 లక్షల నగదు అపహరణ 7

కొత్త పరీక్ష..!

● పుస్తక రూపంలో విద్యార్థులకు నిర్వహణ
● ఒకే బుక్‌లెట్‌లోనే అన్ని సమాధానాలు
● భద్రపరచడంలో ఉపాధ్యాయులకు కష్టాలు
● నేటి నుంచే నూతన పద్ధతిలో ఎఫ్ఏ-1



విద్యార్థినులు

అనంతపురం విద్య, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీయడానికి పరీక్షా పద్ధతుల్లో నూతన ఒరవడికి విద్యాశాఖ శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు ఆశించిన మేర ఉండడంలేదు. కిందిస్థాయి నుంచి పైస్థాయి తరగతుల వరకు సగం మంది పిల్లలు సరిగా చదవడం, కూడికలు, తీసివేతలు వంటివి చేయడం కూడా రాదని ఇటీవల కేంద్ర సంస్థలు నిర్వహించిన సర్వేలో బయటపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. మరోవైపు పిల్లల అభ్యసనా సామర్థ్యాలు గుర్తింపునకు పరీక్షల నిర్వహణలోనూ కొత్త విధానాలు తీసుకొచ్చారు. గతంలో టెస్టులు, క్వార్టర్లీ, ఆఫ్ ఇయర్లీ, ఫైనల్ పరీక్షలు తెల్లపేపర్లపై రాయించి టీచర్లు మూల్యాంకనం చేసి మార్కులు కేటాయించేవారు. ఈ విద్యా సంవత్సరం నిర్వహించే పరీక్షలన్నీ ఒకే బుక్‌లెట్‌లోనే రాయాల్సి ఉంటుంది. అన్ని పరీక్షల సమాధానాలు అదే బుక్‌లెట్‌లోనే ఉంటాయి. తరగతుల వారీగా ఒక్కో విద్యార్థికి ఒక్కో బుక్‌లెట్ రూపంలో అసెస్‌మెంట్ ఆన్సర్‌షీట్ ఉంటుంది. ఈ బుక్‌లెట్‌లోనే ఏడాదిలో అన్ని పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

నేటి నుంచే కొత్త పద్ధతిలో ఎఫ్ఏ-1 పరీక్షలు

కొత్త విధానంలో జరిగే తొలి ఎఫ్ఏ-1 పరీక్షలు సోమవారం నుంచి మొదలు కానున్నాయి. 13వ తేదీ వరకు ప్రైమరీ స్కూల్స్ విద్యార్థులకు, 14వ తేదీ వరకు 6వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు నిర్వహించనున్నారు. రాష్ట్ర శాఖ నుంచి వచ్చిన బుక్‌లెట్స్‌ను (మిగతా 7లో...)

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కృష్ణకళా మందిరం నుంచి టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు జాతీయ జెండాలు చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జాతీయతను చాటేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్శిటీ వీసీ ఎస్ఏ కోరి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు, నేతలు సందిరెడ్డి శ్రీనివాసులు, కాపు రామచంద్రారెడ్డి, చిరంజీవి రెడ్డి, అశోక్‌రెడ్డి, పైలా నరసింహయ్య, రత్నమయ్య పాల్గొన్నారు.



జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు


నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం రోడ్డులో దుస్థితి


సోమనాథ్‌నగర్ బ్రిడ్జి వద్ద తేలిన రాళ్లు


సోమనాథ్‌నగర్‌లో గుంతలు

నగర ప్రయాణం.. నరకప్రాయం..!

(5వ పేజీ తరువాయి)

మరమ్మతులు చేయకపోవడంతో గుంతలు విపరీతమయ్యాయి.

చినుకుపడితే అంతే..

నగరంలో చినుకుపడితే గుంతల్లో నీరు నిలబడిపోతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అశోక్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న గుంతల్లో చినుకుపడి గుంతలు మరింత లోతుగా ఏర్పడ్డాయి. దీంతో మోకాల్లోతు వర్షం నీరు నిల్వ ఉంటుండడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

స్పీడ్ బ్రేకర్లతో బేజారు

నగరంలో అవసరం లేని చోట్ల కూడా స్పీడ్ బ్రేకర్లు వేయడంతో ప్రజలు బేజారవుతున్నారు. నవోదయకాలనీ స్మశానం నుంచి విద్యుత్‌నగర్‌లోకి ప్రధాన రహదారి రెండు కిలోమీటర్ల మేర ఉంది. ఇందులో సుమారు 20 స్పీడ్‌బ్రేకర్లు ఉన్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు విసిగిపోతున్నారు. ఇక్కడ అన్ని స్పీడ్ బ్రేకర్లు అవసరం లేకపోయినా... ఎవరికి వారు స్పీడ్‌బ్రేకర్లు వేసుకున్నారు.

గుంతలు పూడ్చే చర్యలు చేపట్టాం



నగరంలోని రోడ్లలో ఉన్న గుంతలు పూడ్చి, రహదారుల మరమ్మతులు చేపడుతున్నాం. ఇటీవల స్టాండింగ్ కమిటీలో కూడా పలు రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు అనుమతిచ్చారు. టెండర్లు వేసి పనులు చేపడతాం. ఇక వర్షం పడినపుడు నీరు నిలబడితే భూమి పలచపడి గుంతలు ఏర్పడతాయి. గుంతలు లేకుండా రోడ్లు నిర్మిస్తే వర్షపు నీరు కాలువల్లోకి వెళ్లిపోతుంది. అవసరం ఉన్న చోట మాత్రమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

-బాలస్వామి, నగరపాలక సంస్థ కమిషనర్

విలువలను బోధించే 'జీవన శిల్పి'

-పుస్తకావిష్కరణ సభలో డాక్టర్ శాంతినారాయణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మనిషి జీవిత విలువలను బోధించే కవితా సంపుటి 'జీవన శిల్పి' అని ప్రముఖ రచయిత డాక్టర్ శాంతినారాయణ పేర్కొన్నారు. కవి గుడిపాటి సూర్యం రచించిన 'జీవన శిల్పి' పుస్తకావిష్కరణ సభను జిల్లా రచయితల సంఘం (జిరసం) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో శాంతినారాయణ మాట్లాడుతూ.. గుడిపాటి సూర్యం రచించిన ఈ కవిత్వం జగతికి జీవన విలువలను నేర్పుతుందన్నారు. రైతు జీవితాన్ని, వర్ధమాన ప్రజా జీవిత సంఘర్షణను, విలువలు మృగ్యమైపోతున్న సమాజ తీరును ఈ పుస్తకంలో అక్షరబద్ధం చేశారని పేర్కొన్నారు. అనంతరం రచయిత గుడిపాటి సూర్యం మాట్లాడుతూ... ప్రపంచం నిండా వేదన నిండుకున్నపుడు కవిత్వం రాయకుండా ఉండలేకపోయానని అన్నారు. కవిత్వానికే పరిమితం కాకుండా తాను కథా, నవలా రచన కూడా చేపట్టానని, త్వరలో వాటిని పుస్తకాలుగా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. జిరసం నాయకులు, సాహితీవేత్తలు గుడిపాటి సూర్యాన్ని సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ అంకె శ్రీనివాస్, వెంకటేశులు, శ్రీనివాసులు, జెన్నె ఆనంద్‌కుమార్, వన్నప్ప, మధురశ్రీ, రమేష్, వంశీ, నాగభూషణ, టీవీ రెడ్డి, జూటూరు షరీఫ్, చంద్రశేఖరశాస్త్రి, రియాజుద్దీన్, చెట్ల ఈరన్న, అప్పిరెడ్డి, కటకం కృష్ణవేణి పాల్గొన్నారు.

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)కు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఈ మేరకు జీఓ నంబరు 669ను జారీ చేశారు. 2026 జనవరి 30వతేదీ వరకు ఆరు నెలల పాటు త్రిసభ్య కమిటీల పదవీకాలం నిర్ణయించారు. బుక్కరాయసముద్రం సొసైటీ ఛైర్మన్‌గా కేశన్న, సభ్యులుగా సాకే గంపన్న, రామాంజినేయులును నియమించారు. జంబులదిన్నె సొసైటీ ఛైర్మన్‌గా మారెడ్డి కేశవరెడ్డి, సభ్యులుగా జిన్నె నాగరాజు, ఆంజనేయులును ఎంపిక చేశారు. బి. పప్పూరు సొసైటీ ఛైర్మన్‌గా నరసింహుడు, సభ్యులుగా లోకనాథ్, ఓబులప్పకు అవకాశం కల్పించారు. క్రిష్టపాడు సొసైటీ ఛైర్మన్‌గా చిన్న చెన్నారెడ్డి, సభ్యులుగా రాముడు, పురుషోత్తంను ఎంపిక చేశారు. పెద్దవడుగూరు సొసైటీ ఛైర్మన్‌గా బాలాంజనేయులు, సభ్యులుగా మల్లికార్జునరెడ్డి, తలారి వాసులను నియమించారు. ముచ్చుకోట సొసైటీ ఛైర్మన్‌గా చిన్న నారాయణ, సభ్యులుగా లక్ష్మీదేవి, లక్ష్మీనారాయణరెడ్డికి అవకాశం దక్కింది. చీమలవాగుపల్లి సొసైటీ ఛైర్మన్‌గా రంగారెడ్డి, సభ్యులుగా ఈశ్వరరెడ్డి, అనంతరమణకు అవకాశం కల్పించారు. చిన్నపప్పూరు సొసైటీ ఛైర్మన్‌గా రుద్రేశ్వరనాయుడు, సభ్యులుగా విజయభాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డికి చోటు దక్కింది. జూటూరు సొసైటీ ఛైర్మన్‌గా నాగేశ్వరరెడ్డి, సభ్యులుగా సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డిని ఎంపిక చేశారు. చుక్కలూరు సొసైటీ ఛైర్మన్‌గా రామకృష్ణారెడ్డి, సభ్యులుగా రామాంజనేయులురెడ్డి, చంద్రమోహన్ యాదవ్‌కు దక్కింది. దిగువపల్లి సొసైటీ ఛైర్మన్‌గా సాంబశివారెడ్డి, సభ్యులుగా శ్రీనివాసరెడ్డి, సుభాన్‌ను ఎంపిక చేశారు. వీరాపురం సొసైటీ ఛైర్మన్‌గా ప్రభాకర్ నాయుడు, సభ్యులుగా చంద్రశేఖర్‌రెడ్డి, నాగన్నను నియమించారు. వేములపాడు సొసైటీ ఛైర్మన్‌గా నాగమునిరెడ్డి, సభ్యులుగా వెంకటనరసింహులు, లక్ష్మీదేవిలను ఎంపిక చేశారు. యల్లనూరు సొసైటీ ఛైర్మన్‌గా తరిగోపుల అనిల్‌కుమార్, సభ్యులుగా సుబ్బరాయుడు, చిన్న రామన్నను నియమించారు. కంబదూరు సొసైటీ ఛైర్మన్‌గా బాబయ్య, సభ్యులుగా ఆదినారాయణ, రామాంజనేయులకు అవకాశం కల్పించారు. బండమీదపల్లి సొసైటీ ఛైర్మన్‌గా చిత్రలింగప్ప, సభ్యులుగా గోవిందప్ప, చలపతిని ఎంపిక చేశారు. కణేకల్లు సొసైటీ ఛైర్మన్‌గా నాగార్జున, సభ్యులుగా చిన్న ఈరప్ప, తిప్పేస్వామికి చోటు దక్కింది. రాచానపల్లి సొసైటీ ఛైర్మన్‌గా కలిమిశెట్టి రఘు, సభ్యులుగా శ్రీనివాసులు, బండి నారాయణను నియమించారు. ముట్టాల సొసైటీ ఛైర్మన్‌గా లింగన్న, సభ్యులుగా వెంకటరామిరెడ్డి, సుజాతమ్మకు అవకాశం కల్పించారు.

సెక్టోరల్స్ నియామకానికి మరో అడుగు

- నేడు, రేపు టీచర్లకు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఏడాదిగా ఖాళీగా ఉన్న సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి మరో అడుగు పడింది. కీలకమైన ఈ పోస్టులను భర్తీచేయకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ సీరియస్‌గా తీసుకొని నియామకాల ప్రక్రియకు చర్యలు చేపట్టారు. ఆరు సెక్టోరల్స్‌కు వచ్చిన 171 దరఖాస్తులను కలెక్టరేట్‌లోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయించి పరిశీలింపచేయించారు. అర్హత సాధించిన టీచర్లను ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్‌లో ఉండే ఎన్‌ఐసీ సెంటర్‌లో ఇంటర్వ్యూల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టి టీచర్లను ఆహ్వానించారు. దీంతో సెక్టోరల్స్ నియామకాలకు లైన్‌క్లియర్ అయినట్లు కనబడుతోంది.

గుట్టుగా..

సెక్టోరల్స్ నియామకాల విషయంలో ఎస్‌ఎస్‌ఏ అధికారులు గుట్టుగానే వ్యవహారాలు నడుపుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత 171 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఫలానా పోస్టుకు ఇన్ని దరఖాస్తులు వచ్చాయని మాత్రం చెప్పారు. తర్వాత జరిగిన దరఖాస్తుల పరిశీలన, ఎంత మంది అర్హత సాధించారు, ఎన్ని దరఖాస్తులను తిరస్కరించారో కూడా చెప్పలేదు. ఇంటర్వ్యూలు సంగతి కూడా ఎస్‌ఎస్‌ఏ అధికారులు చెప్పలేదు. చివరకు ఏపీసీ శైలజను 'ఆంధ్రజ్యోతి' విచారించగా.. సోమ, మంగళవారాలు ఇంటర్వ్యూలు ఉన్నాయన్నారు. ఇంటర్వ్యూలకు పిలిచిన టీచర్లలో కొందరు అనర్హులు ఉన్నారని తెలుస్తోంది. పరీక్షల సమయంలో అమ్మాయిలపట్ల అసభ్యంగా వ్యవహరించాడని గతంలో డీఈఓగా ఉన్న శ్యాముల్ సరెండర్ చేసి.. పదేళ్లపాటు ఈ శాఖకు రావడానికి అనర్హుడిగా ప్రకటించి ఉత్తర్వులు ఇచ్చిన ఓ టీచర్ కూడా ఇంటర్వ్యూ జాబితాలో ఉన్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో నియామకాలు పారదర్శకంగా జరుగుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త పరీక్ష..!

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలకు, ప్రశ్నపత్రాలను ఎంఆర్‌సీలకు జిల్లా విద్యాశాఖ సరఫరా చేసింది. ప్రశ్నపత్రాలు పరీక్షకు గంట ముందు మాత్రమే ఎంఆర్‌సీల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. డీసీఈబీ నేతృత్వంలో టీచర్లకు మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

టీచర్లకూ పరీక్షే

కొత్త విధానంలో పరీక్షలు టీచర్లకూ పరీక్షగా మారాయనే అభిప్రాయాలు ఆ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఒక్కో విద్యార్థికి ఒక బుక్‌లెట్ (ఆన్సర్‌షీట్) పాఠశాలలకు సరఫరా చేశారు. ఇదే బుక్‌లెట్‌లోనే ఏడాదిలో జరిగే ఎఫ్ఏ-1,2,3, ఎస్ఏ-1,2,3 పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలు ముగిసేవరకు విద్యార్థికి వచ్చిన బుక్‌లెట్‌ను భద్రంగా పాఠశాలలోనే దాచిపెట్టుకోవాల్సి ఉంటుంది. ఎక్కువ విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలలో ఒక్కో టీచర్‌కు సరాసరిగా 250 నుంచి 300 వరకు బుక్‌లెట్స్ వస్తాయి. ఇక తెలుగు, హిందీ టీచర్లకు ఆ స్కూల్‌లో ఉన్న పిల్లలందరీ బుక్‌లెట్స్ వస్తాయి. వీటిని భద్రపరుచుకోవడానికి పాఠశాలలో ఉన్న టీచర్ల స్టాఫ్‌రూమ్‌లలో అల్మారాలు లేవు. ఇప్పటికే బుక్‌లెట్లను స్టాఫ్‌రూమ్‌లలో వారు కూర్చుంటున్న బెంచీలపై పెట్టుకున్నారు. వాటిని ఏడాదిపాటు ఎలా కాపాడుకోవాలో అర్థంకావడంలేదు. ఒక బుక్‌లెట్ పోతే ఆ విద్యార్థికి సంబంధించిన సమాధాన పత్రం మొత్తం ఇబ్బందిగా మారుతుంది. మూల్యాంకనంలోనూ కొత్తమెలిక పెట్టారు. విద్యార్థి రాసిన జవాబులు, పరీక్షల్లో వచ్చిన మార్కులు స్కాన్‌చేసి పంపాల్సి ఉంటుంది. మార్కులకు సంబంధించి సంజాయిషీ రాసి పంపాల్సి ఉంటుంది. ఇలాగైతే పిల్లలకు పాఠాలు చెప్పేది ఎప్పుడని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సంజాయిషీ సరికాదు

ఒక విద్యార్థి ఏడాదిపాటు రాసే పరీక్షలకు సంబంధించి ఒకే బుక్‌లెట్ ఇవ్వడం మంచిదే. దీనివల్ల ఏ పరీక్షలో విద్యార్థి సామర్థ్యాలు పెరిగాయో, తగ్గాయో సులభంగా తెలుసుకోవచ్చు. పరీక్షల పత్రాలు, ఓఎంఆర్ షీట్లు, టీచర్ల మూల్యాంకనంలో ఇచ్చిన మార్కులకు సంజాయిషీ రాయడం వంటివే ఇబ్బందికరంగా మారుతున్నాయి. పెద్ద స్కూళ్లలో వందల మంది పిల్లలు ఉంటారు. అలాంటపుడు ఇన్ని పనులు ఆ టీచర్ ఎలా చేస్తారో అర్థంకావడంలేదు.

-శ్రీనివాసులు, ఫిజిక్స్ టీచర్

ఒత్తిడిలేని బోధన అవసరం



కొత్త సంస్కరణలు తీసుకొచ్చినపుడు టీచర్లు, పిల్లలకు ఉపయోగకరంగా ఉండాలి. టీచర్లపై ఒత్తిడిపెట్టి ఇలాగే చేయాలని ఆదేశాలు ఇవ్వడం సరికాదు. కొత్త పరీక్షల విధానంలో ఇదే జరుగుతోంది. బుక్‌లెట్స్ పెట్టుకోవడానికి పాఠశాలలో స్థలంలేదు. ఏడాదిపాటు టీచర్లు వాటిని ఎక్కడ భద్రపరచుకోవాలో తెలియడంలేదు. స్కాన్ చేసిపెట్టాలనడం టీచర్లకు మరింత భారంగా మారుతుంది. దీనివల్ల పిల్లలకు పాఠాలు చెప్పే సమయం లేక అన్యాయం జరుగుతుంది.

-రామాంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి, ఎస్టీయూ

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం



ఈసారి ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో కొత్త విధానం తీసుకు వచ్చింది. ఆ మేరకు ఆన్సర్‌షీట్స్ (బుక్‌లెట్స్), ప్రశ్నపత్రాలు జిల్లాకు వచ్చాయి. 1 నుంచి 5వ తరగతుల వరకు ప్రశ్నపత్రాలను క్లస్టర్ స్కూళ్లకు, 6నుంచి 10వ తరగతుల వరకు ప్రశ్నపత్రాలను ఎంఆర్‌సీలకు పంపి భద్రపరిచాం. పరీక్ష రోజు గంట ముందు మాత్రమే అక్కడికి వెళ్లి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లాలి. ఎక్కడైనా సమస్యలు వస్తే మా దృష్టికి తీసుకురావాలి.

-గంధం శ్రీనివాసులు, కార్యదర్శి, డీసీఈబీ

దంచికొట్టిన వాన

(5వ పేజీ తరువాయి)

రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. ఆవులతిప్పాయపల్లి సమీపంలో జీపు వంక దాటుతుండగా కొట్టుకుపోయింది. డ్రైవర్ ఒడ్డుకు చేరుకుని, ప్రాణాలు కాపడుకున్నాడు. ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయ సమీపంలో తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొండచరియలు విరిగిపడడంతో ఆ బురద మట్టిలో వాహనాలు కూరుకుపోయాయి. తాడిపత్రిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. లక్ష్మీనారాయణటాకీస్‌లోకి వర్షపునీరు చేరింది.

- పుట్లూరు మండలంలోని ఎస్. తిమ్మాపురం గోడౌన్ వద్ద తక్కళ్లపల్లికి వెళ్లే కల్వర్టు వర్షానికి కూలిపోయింది. దీంతో తక్కళ్లపల్లి నుంచి తాడిపత్రికి రాకపోకలు స్తంభించిపోయాయి. మండలవ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో వంకలు పొంగి పొర్లాయి.
- పెద్దవడుగూరులో వర్షానికి పీర్లచావిడి పైభాగం ఆదివారం ఉదయం కూలిపోయింది. నిత్యం పీర్లచావిడి కట్ట వద్ద పదుల సంఖ్యలో జనం కూర్చునేవారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.
- యల్లనూరు మండలంలో తాడిపత్రికి వెళ్లే ప్రధాన రహదారిపై నిట్టూరు గాండ్లపాడు, గన్నేరుపల్లి వంకలు ఉధృతంగా ప్రవహించడంతో ఉదయం 10 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం 1గంటల ప్రాంతంలో పెద్ద పెద్ద ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వంక మరోసారి ఉధృతంగా ప్రవహించింది. దీంతో చిత్రావతి నదిలో ప్రవాహం భారీగా పెరిగింది.

చిత్రావతి పరవళ్లు

ధర్మవరం: మండలంలోని పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా పారుతోంది. బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి వర్షపునీరు ధర్మవరం చెరువుకు చేరుతోంది. దీంతో నదికి నీటి ప్రవాహం పెరిగింది. పోతులనాగేపల్లి వద్ద నది ఉధృతంగా ప్రవహించడంతో కనంపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి.

- పెనుకొండ మండలంలోని మునిమడుగు గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మించి, డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడమే ఈ దుస్థితికి కారణమని వారు వాపోయారు.

వర్షపాతం నమోదు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో శనివారం పదును వర్షం పడింది. కొత్తచెరువులో అత్యధికంగా 7.64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడిపత్రి 7.2, నార్పల 6.6, నల్లమాడ మండలంలో 6.52 సెం.మీ., బుక్కపట్నంలో 5.90 సెం.మీ., పుట్టపర్తి 5.86, పుట్లూరు 5.8, యల్లనూరు 5.6, శెట్టూరు 5.5, గాండ్లపెంట 5.44, ఓబుళదేవరచెరువు 5.42, రొద్దం 5.16, తాడిమర్రి 4.72, సోమందేపల్లి 4.70, పెనుకొండ 4.46, తనకల్లు 4.46, నల్లచెరువు 4.42, చెన్నేకొత్తపల్లి 4.26, గుడిబండ 4.12, గోరంట్ల 3.82, బత్తలపల్లి 3.62, మడకశిర 3.56, ధర్మవరం 3.46, ముదిగుబ్బ 3.22, పరిగి 3.04, గుమ్మఘట్ట 2.8, కదిరి 2.68, హిందూపురం 2.18, కంబదూరు 1.9, లేపాక్షి 1.82, రాయదుర్గం 1.7, రొళ్ల 1.54, తలుపుల 1.22, చిలమత్తూరు 1.20, అగళి 1.18, కనగానిపల్లి 1.02, రామగిరి 0.28 సెం.మీ. వర్షం కురిసిందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.


పెద్దవడుగూరులో కూలిన పీర్ల చావిడి పైకప్పు


పుట్టపర్తిలో రహదారిపై పారుతున్న వర్షపునీరు


పుట్లూరు మండలం ఎస్ తిమ్మాపురం గోడౌన్ వద్ద కుంగిపోయిన కల్వర్టు

ఆటోమొబైల్ షాపులో చోరీ

కదిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న శ్రీరాం ఆటో మొబైల్ షాప్‌లో చోరీ జరిగినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం రోడ్డులో ఉండే శ్రీరాం ఆటో మొబైల్‌షాప్‌ను శనివారం రాత్రి యజమానులు రాజేష్, పతారం షాప్ మూసి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం తిరిగి షాప్ తెరవడానికి వచ్చారు. షాప్ షట్టర్‌ను తెరచి ఉండడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాప్‌లోకి వెళ్లి చూడగా అందులో ఉన్న రూ.2 లక్షల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. మరింత డబ్బు ఉన్నట్లు షాప్ యజమానులు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ శివనారాయణస్వామి పరిశీలించారు.

నేడు జిల్లా జైలులో వేరుశనగ వేలం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా జైలులో సోమవారం వేరుశనగ చెక్క వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జైలులో ఉన్న 25వేల కిలోల వేరుశనగ చెక్కను వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలం పాట జిల్లా జైలులో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని వెల్లడించారు.

టమోటా కిలో రూ.40

అనంతపురంరూరల్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.24, సరాసరి ధర రూ.30 పలికాయన్నారు. మార్కెట్‌కు 2,700 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే దగ్గుపాటి జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు మధు రాయల్, రమేష్ రాయల్, జోగి రాజేంద్ర తదితరులు

అనంతపురం క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జన్మదిన వేడుకలను ఆదివారం అభిమానులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ కోలాహలం నెలకొంది. పెద్ద పెద్ద కేక్‌లను ఆయనతో కట్ చేయించారు. ఒకరికొకరు కేక్‌లు, స్వీట్లు పంచుకుని సందడిగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే నేత్రదానానికి ముందుకు వచ్చారు. ఆయన నుంచి స్ఫూర్తి పొందిన ఆయన సతీమణి శ్రీలక్ష్మి, వారి కుమార్తె అశ్రిత సైతం నేత్రదానానికి అంగీకరించారు. భారీ మెజారిటీతో గెలిపించిన అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలకు శక్తిఉన్నంత వరకూ సేవ చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


జూటూరు రమేష్ (ఫైల్)

గుంతకల్లుటౌన్,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన కౌలు రైతు జూటూరు రమేష్(32) అప్పులబాధ భరించలేక ఆదివారం రాత్రి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. జూటూరు రమేష్‌కు ఒకటిన్నర ఎకరా పొలం ఉంది. మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప, కంది, వేరుశనగ పంటలను సాగుచేశాడు. రూ.15 లక్షల మేర అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టాడు. పంటలు చేతికి రాక, అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపం చెందిన రమేష్ శనివారం రాత్రి ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని, మరణించాడు. ఉదయం కుటుంబ సభ్యులు గది తలుపులు తెరవగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమేష్‌కు భార్య జ్యోతి, బాబు, పాప ఉన్నారు. గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు చోట్ల రైలు కిందపడి ఇద్దరు..

గుత్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం ఇద్దరు వ్యక్తులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గుత్తి-పాతకొత్తచెరువు రైల్వే స్టేషన్‌ల మధ్య ఓబులపురం గ్రామ సమీపంలో రైలు కింద పడి రామకృష్ణ (45)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఓబులపురం గ్రామానికి చెందిన రామకృష్ణ మతిస్థిమితం సరిగా లేక అనారోగ్యం కారణంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే విధంగా గుత్తి-రామరాజుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సురేష్(28) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ రోగం నయం కాకపోవడంతో మనస్థాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం, ఆయిల్ ట్యాంకర్ ఢీ

-యువకుడి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

గోరంట్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి ప్రధాన రహదారిపై రెడ్డి చెరువు కట్ట వద్ద ఆయిల్ ట్యాంకర్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మహేంద్ర (21) అనే యువకుడు మృతిచెందగా, శ్రీనివాసులు, కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం గోరంట్ల మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన శంకర్ కుమారుడు మహేంద్ర, స్నేహితులు శ్రీనివాసులు, కార్తీక్ ద్విచక్రవాహనంలో గోరంట్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రెడ్డిచెరువు కట్ట వద్ద కదిరి వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొనగా మహేంద్ర అక్కడిక్కడే మృతిచెందాడు. తీవ్రంగా తలకు గాయాలైన శ్రీనివాసులు, కార్తీక్‌ను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ తేజశ్విని ప్రాథమిక చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు. గోరంట్ల పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే టీడీపీ మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి సంఘటనా స్థలాన్ని సందర్శించగా, సర్పంచ్ అశ్వర్థరెడ్డి మృతుడి కుటుంబానికి, గాయపడిన వారికి చికిత్సల నిమిత్తం ఆర్థికసాయం అందించారు.

గోరంట్లలో భారీ చోరీ

- 150 గ్రాముల బంగారం, రూ.7.50 లక్షల నగదు అపహరణ

గోరంట్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్షనర్స్ భవనం వెనుక వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు చలపతి నివాసం తాళం పగలకొట్టి 150 గ్రాముల బంగారు వస్తువులు, రూ.7.50 లక్షల నగదు శనివారం అపహరించారు. చలపతి కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లారు. ఇంటి ప్రధాన ద్వారం డోర్‌లాక్‌ను గుణపంతో బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా పగులకొట్టి అందులోని బంగారు వస్తువులు, నగదు ఎత్తుకెళ్లారు. తలుపులు తెరచి ఉండడంతో వీధి ప్రజలు గుర్తించి, వారికి ఫోన్‌ద్వారా ఆదివారం ఉదయం సమాచారం అందించారు. హుటాహుటిన వారు గోరంట్లకు వచ్చి పరిశీలించగా.. చీటీలకు సంబంధించిన రూ.7.50 లక్షల నగదు, చైన్, ఉంగరాలు తదితర బంగార వస్తువులు దాదాపు 15 తులాలు చోరీ అయినట్లు బాధితుడు తెలిపారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా.. దుండగలు కారులో వచ్చి చోరీకి పాల్పడినట్లు తెలిసింది. సీఐ శేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీమ్‌ను రంగంలోకి దింపి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కష్టం ఉందంటే వెంటనే స్పందిస్తున్న సీఎం

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత



చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య విషయంలో ఈ ప్రభుత్వం డబ్బు ఖర్చు చేసేందుకు వెనకాడటం లేదని, కష్టం ఉందంటే సీఎం చంద్రబాబు వెంటనే స్పందిస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి, కనగానపల్లి,చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 13 మందికి రూ.6.40లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను వెంకటాపురంలో ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక గతంలో ఎన్నడూలేని విధంగా నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైందన్నారు. కష్టం ఉందంటే సీఎం చంద్రబాబు వెంటనే స్పందిస్తున్నారని తెలిపారు. చెక్కులు అందుకున్న వారు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యేపరిటాలసునీతకు కృతజ్ఞతలు తెలిపారు. కనగానపల్లి మండల కన్వీనర్ యాతంపోతలయ్య, నాయకులు శ్రీనివాసులు, దుబ్బార్లపల్లి వెంకటేశ్, నరసయ్య పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ

రామగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ కలిసి ఆదివారం భూమి పూజ చేశారు. బీసీకాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎస్సీకాలనీలో పెద్దమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో వీలైనంత త్వరగా ఆలయాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కుంటిమద్దిలో వైద్యశిబిరం

రామగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సహకారంతో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన అమ్లియో ఆస్పత్రి వారు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి వైద్యులు వైద్యపరీక్షలు నిరహించారు. కొందరిని వైద్యసేవల నిమిత్తం ఎంపిక చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారుతీప్రసాద్, చంద్రప్ప, బ్రహ్మ, చలపతి, రఘురాములు, కమతం కిష్టప్ప, ఆనంద్, లింగమయ్య, కుళ్లాయప్ప, తిరుపాలు, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.2.46 లక్షలు

అనంతపురం రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో మార్కెట్‌కు రూ.2,46,400 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,35,850లు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1,10,550 చొప్పున మార్కెట్‌కు ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

దాడి దారుణం: సీపీఐ

అనంతపురం విద్య, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయినగర్‌లో గల అస్ర క్లినిక్‌పై శనివారం రాత్రి దుండగులు దాడిచేసి తాళాలు పగులకొట్టడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మండిపడ్డారు. ఈ ఘటనను నిరసిస్తూ బాధితులతో కలిసి సీపీఐ నాయకులు ఆదివారం క్లినిక్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయన్నారు. ఈ దాడిపై బాధితులు డాక్టర్ షరీఫ్, సుమియా దంపతులు పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడం హేయమన్నారు. అనంతరం వారు డీఎస్పీని కలిసి దాడులు చేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, లింగమయ్య,సంతోష్‌కుమార్, రమణ, కృష్ణుడు, జయలక్ష్మీ, ఎల్లుట్లనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


భూకబ్జాలు, దౌర్జన్యాలను అరికట్టాలి: మేయర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకి పెరిగిపోతున్న భూకబ్జాలు, దౌర్జన్యాలను అరికట్టి ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని అనంత నగరపాలక సంస్థ మేయర్ మహ్మద్ వసీం పోలీసు అధికారులను కోరారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నగరంలో జరుగుతున్న ఘటనలతో లాఅండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సాయినగర్‌లో ఒక మైనార్టీ కుటుంబానికి చెందిన క్లినిక్‌పై కొందరు శనివారం రాత్రి దాడి చేసినా పోలీసులు అటువైపు చూడకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వం, పోలీసులు స్పందించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తపోవనంలో కోట్లాది రూపాయలు విలువచేసే భూమిలోకి దౌర్జన్యంగా వెళ్లి కంచెలు, నిర్మాణాలను తొలగించి ఆక్రమించుకోవడానికి యత్నించిన ఘటనపై కూడా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

'ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం'

అనంతపురం వైద్యం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతం పోరాడతామని, గత ఐదేళ్లలో ఈ పోరాట ఫలితంగా పలు సమస్యల్ని పరిష్కరించుకోవడం జరిగిందని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. స్థానికరోడ్లు, భవనాల అతిథిగృహంలో ఆదివారం నిర్వహించిన నూతన కమిటీ ఎన్నిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సకాలంలో వేతనాలు చెల్లిస్తోందన్నారు. అపరిష్కృత సమస్యలను పరిగణలోకి తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన అవసరముందని కోరారు. అనంతరం రాయలసీమ జోనల్ అధ్యక్షుడిగా దాసరి ఆదినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎండీ నాగభూషణం, ఆర్ఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ ఉజ్వల్, జిల్లా అధ్యక్షుడు ముత్యాలరాజు, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి పాలనలోనే గీత కార్మికుల సంక్షేమం'



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనేనని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. అనంతపురం నగరానికి ఆదివారం వచ్చిన ఆయన రాష్ట్ర ఈడిగ సాధికార కమిటీ సభ్యుడు మేకల గోపాల్ గౌడ్, ఇతర నాయకులు, ఈడిగ కులస్థులతో కలిసి ఎన్టీఆర్ సర్కిల్‌లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులకు 10 శాతం బార్లు కేటాయించడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి మరువలేనిదన్నారు. గీత కార్మికులకు సీఎం చంద్రబాబు పెద్దన్నగా నిలిచారన్నారు. ఇప్పటికే కూటమిప్రభుత్వం గీత కార్మికుల్లో 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ అందిస్తోందన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి చంద్రన్న బీమా వర్తింపజేస్తోందన్నారు. ఆదరణ పథకం ద్వారా కూడా గీత కార్మికులకు తోడుగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే వాల్మీకుల అభ్యున్నతి

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
- కేకే అగ్రహారంలో మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ



వాల్మీకి విగ్రహావిష్కరణలో పాల్గొన్న కాలువ శ్రీనివాసులు, బండారు శ్రావణిశ్రీ, ముంటిమడుగు కేశవరెడ్డి

బుక్కరాయసముద్రం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వాల్మీకుల అభ్యున్నతి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కేకే అగ్రహారంలో మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా కాలవ శ్రీనివాసులతో పాటు ఎమ్మె ల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కాలవ మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తొలుత సీఎం చంద్రబాబే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారన్నారు. 2017లో అసెంబ్లీలో ఏక పక్షంగా వాల్మీకులను ఎస్టీజాబితాలోకి చేర్చాలని తీర్మానం చేసింది టీడీపీనేనని తెలిపారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై అప్పటి సీఎం జగన్ నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రస్తుతం తిరిగి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. వాల్మీకి జయంతిని అధికారికంగా ప్రకటించిన ఏకైక నేత చంద్రబాబేనని, వాల్మీకి కులస్థుల అభ్యున్నతి ఆయనతోనే సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ఏడీసీసీబీ చైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. వాల్మీకి బోయల కోసం నిరంతరం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, టీడీపీ నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, ఈడిగ రాము, గోవిందరెడ్డి, కనుమ నారాయణస్వామి, రాము, కనుమ రవి, లోకనాథ్, నరసింహులు పాల్గొన్నారు.

గంగినేపల్లి వద్ద కూలిన వంతెన

- ఏడు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాలతో తక్షణ చర్యలు



వంతెనను పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు ఎల్ నారాయణచౌదరి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగినేపల్లి వద్ద చాకిరేవు వంకపై నిర్మించిన వంతెన శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నేళ్ల క్రితం భారీ వర్షానికి కూలిపోయిన వంతెనపై అప్పట్లో తాత్కాలికంగా మట్టి వేశారు. భారీ వర్షానికి అది కొట్టుకుపోయింది. దీంతో వంతెన వద్ద భారీ అఘాతం ఏర్పడి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంగినేపల్లి, ఎర్రోనిపల్లి, బ్రాహ్మణపల్లి, దూపంపల్లి మరో మూడు తండాలు కలిపి ఏడు గ్రామాల ప్రజల రాకపోకలకు అవరోధం ఏర్పడింది. దీంతో పట్టణాలకు, మండల కేంద్రానికి సిద్దరాంపురం, కొత్త చెరువు మీదుగా వెళుతున్నారు. వంతెన కూలి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తక్షణం స్పందించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె సూచనలతో టీడీపీ నాయకులు ఎల్. నారాయణ చౌదరి, ముత్యాల్‌రెడ్డి, దండు ఓబుళేసు వంతెనను పరిశీలించారు. అక్కడికి వచ్చిన పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణతో వంతెన మరమ్మతులపై చర్చించి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రూ.6 లక్షలు మండల నిధులతో తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో అప్పటికప్పుడే పనులు ప్రారంభించారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిపోయిన ఇల్లు

గార్లదిన్నె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనకచెర్ల కొత్తపల్లిలో పెనుప్రమాదం తప్పింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి పెనకచెర్ల కొత్తపల్లిలో గోపినాథ్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. పాత ఇల్లు కావడంతో కారుతోంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు అనుమానం రావడంతో గోపినాథ్ ముందస్తు జాగ్రత్తగా శనివారం సాయంత్రం ఇల్లు ఖాళీ చేసి మరో ఇంటిలోకి వస్తువులను తీసుకుని వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఇంటి పైకప్పు పడిపోయింది. దీంతో పెనుప్రమాదం తప్పిందని గోపినాథ్ తెలిపాడు.

ఘనంగా యుటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్)52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డులోగల కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. యూటీఎఫ్ ఏర్పడినప్పటి నుంచి విద్యాఉపాధ్యాయ రంగసమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. అదే ఉద్యమ స్ఫూర్తితో ప్రతి యూటీఎఫ్ నాయకుడు భవిష్యత్తులో పోరాటంలో ముందుండాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు జిలాన్, ఈశ్వరయ్య, జిల్లాఅధ్యక్షుడు గోవిందరాజులు, నాయకులు కోటీశ్వరప్ప, నాగేంద్ర,గంగాధర్, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్‌ర్యాలీ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏఎంసీ కమిషనర్ బాలస్వామి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటలకు ఆర్అండ్‌బీ అతిథిగృహం నుంచి టవర్‌క్లాక్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ఉద్యోగులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రచారం

శింగనమల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనపై బీజేపీ నాయకులు మండలకేంద్రంలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత 11 ఏళ్లుగా చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన ఓబిరెడ్డి, నాయకులు వెంకటయ్య, గుజ్జల యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'శిబ్దాస్ ఘోష్ ఆశయాలను కొనసాగిద్దాం'



మాట్లాడుతున్న ఎస్‌యూసీఐ(సీ) కేంద్ర కమిటీ సభ్యుడు అమర్నాథ్

అనంతపురం టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శిబ్దాస్ ఘోష్ ఆశయాలను కొనసాగిద్దామని ఎస్‌యూసీఐ(సీ) కేంద్ర కమిటీ సభ్యుడు అమర్నాథ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన శిబ్దాస్ ఘోష్ వర్ధంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత శిబ్దాస్ ఘోష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో శిబ్దాష్ ఘోష్ పాత్ర ఎనలేనిదన్నారు. స్వాతంత్ర్యానంతరం ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం ఇంకా రాలేదని భావించిన ఆయన లెనినిస్ట్ పార్టీ సూత్రాలకు భిన్నంగా నాటి ఐక్య సీపీఐ ఏర్పడిందని నిర్ధారించిన అనంతరం ఒక నిజమైన కమ్యూనిస్టు పార్టీ ప్రజలకోసం తప్పనిసరి అని భావించి ఎస్‌యూసీఐ(సీ)ను స్థాపించారన్నారు. ఇటీవలికాలంలో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. పెట్టుబడిదారులకు సారవంతమైన, విలువైన భూములను కట్టబెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ(సీ) పొలిట్ బ్యూరో సభ్యుడు రాధాకృష్ణ ,రాష్ట్ర నాయకులు గోవిందరాజులు, లలిత, సుధీర్, గిరీష్, బసవరాజు, జిల్లా నాయకులు తబ్రేజ్, సుబ్రహ్మణ్యం, ముత్యాలు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు

రాప్తాడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం నుంచి గోరంట్లకు అక్రమంగా గోవులు తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, దీంతో వెంటనే దాడులు చేసి తరలిస్తున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. గోవులు అక్రమంగా తరలిస్తున్నారని విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ సభ్యులు సమాచారం తెలిపారని, ఆ మేరకు ఆదివారం 11 గంటల సమయంలో దాడులు చేసి రాప్తాడులో గోవులు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్ వద్ద ఉంచామన్నారు. వాహనంలో 7 ఆవులు ఉన్నాయన్నారు. వాటిని అక్రమంగా తరలిస్తున్న షేక్ బాబ్‌జాన్, దేశ్‌ముఖ్‌బాబ్‌జాన్‌పై విశ్వహిందూ పరిషత్ బజరంగదళ్ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

శింగనమల మార్కెట్ ఛైర్మన్ ఎవరికో?

- పదవి కోసం ఆశావహుల పోటీ
- ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ
- కొలిక్కి రాని పరిస్థితి..



బుక్కరాయసముద్రం, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఎవరికి ఇవ్వాలనేదానిపై ఇంకా కొలిక్కి రాలేదు. దీనిపై టీడీపీ అధిష్ఠానం ఇంకా కసరత్తు చేస్తోంది. ఉమ్మడి అనంత జిల్లాలో మార్కెట్ చైర్మన్‌ల నియామకం ఇప్పటికే 80శాతం పూర్తయింది. అయితే శింగనమల నియోజకవర్గంలో పోటీ ఎక్కువగా ఉండడంతో ఎంపిక ఇంకా కొలిక్కిరాలేదు. ఇప్పటికే... మార్కెట్ యార్డు చైర్మన్ కోసం పార్టీ అధిష్ఠానం పలువురు పేర్లను పరిశీలిస్తోంది. దీనిపై ఐవీఆర్ఎస్ పోల్ ద్వారా అభిప్రాయ సేకరణ కూడా చేపట్టింది. ఇందులో ఇప్పటి వరకు పుట్లూరు మండలానికి చెందిన జీసీ బాబు, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండుశ్రీనివాసులు, టీడీపీ టీకేఎస్ మండల కన్వీనర్ అశోక్‌కుమార్ పేర్లు వచ్చాయి. వీరు కాకుండా శింగనమల జడ్పీటీసీ మాజీ సభ్యురాలు షాలిని, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డేగలకృష్ణమూర్తి కూడా మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నారు. ఆశావాహులు గతంలో పార్టీ కోసం చేసిన కార్యక్రమాలు, సీనియారిటీ, గతంలో చేసిన హోదాలపై పార్టీ క్షుణంగా పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఇందులో కొంత మంది ఆశావాహులు స్థానిక ఎమ్మెల్యేద్వారా పదవి రాబట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మరికొంత మంది ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడుల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా ఎవరి రూట్‌లో వారు ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఐవీఆర్ఎస్ ద్వారా ఇప్పటికే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో పాటు పార్టీలోని వివిధ హోదాల్లో ఉన్న నేతల ద్వారా అభిప్రాయ సేకరణ చేయించడం జరిగింది. పార్టీ ఈ పదవి ఎవ్వరికి కట్టబెడుతుందోనని టీడీపీ నేతల్లో టెన్షన్ నెలకొంది. మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎంపిక విషయంలో పార్టీ ఇప్పటికే ఆలస్యం చేస్తోందని, త్వరగా పేరు ఖరారు చేస్తే బాగుంటుందని నియోజకవర్గంలోని టీడీపీ కేడర్ ఎదురు చూస్తోంది.

పార్టీ మండలాల కన్వీనర్ల ఎంపికలోనూ ఇదే పరిస్థితి..

నియోజకవర్గంలో ఆరు మండలాల్లో టీడీపీ కన్వీనర్లు ఎంపిక కూడా కొలిక్కి రాలేదు. వాటికి తీవ్ర పోటీ నెలకొంది. కన్వీనర్ పదవి తమకే కావాలంటూ... పోటీదారులు పట్టుబడుతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు పర్వీన్ తాజ్, టూమెన్ కమిటీ సభ్యులు ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఆరు మండలాలకు కన్వీనర్ల ఎంపిక విషయంపై ఇప్పటికే సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగింది. అయితే ఇంతవరకూ ఒక్క మండలంలో కూడా కన్వీనర్ ఎంపిక ఖరారు కాలేదు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమర్థులను ఎంపిక చేస్తే.... పార్టీ బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కన్వీనర్లు పోటీ తీవ్ర స్థాయిలో ఉండడంతో పార్టీ అధిష్ఠానానికి పేర్లు పంపినట్లు సమాచారం.



రవీంద్రస్వామి నివాసంలో రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక అలంకరణ



మొదటిరోడ్డులోని మఠంలో విశేష అలంకరణలో బృందావనం

రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

అనంతపురం క్రైం/ టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : జగద్గురు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన మహోత్సవాలు సద్గురు రవీంద్ర స్వామీజీ ఆధ్వర్యంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని విన్సెంట్ ఫెర్రర్ కాలనీలో జేఎన్‌టీయూ రోడ్డులో ఉన్న రవీంద్ర స్వామీజీ నివాసంలో వీటిని ప్రారంభించారు. ఇందులో ప్రథమ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం రాఘవేంద్రస్వామి , వేంకటేశ్వర స్వామి, లక్ష్మీ నరసింహ స్వామితో పాటు అమ్మవారి విగ్రహాలకు, సాలగ్రామాలకు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. అలాగే శ్రీసూక్త, దుర్గాసూక్త, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం రవీంద్ర స్వామి భక్తులకు గంధం, మహిమాన్విత కుంకుమ, పండ్లు అందించారు. తర్వాత కరుట్లపల్లి, కూడేరు, అనంతపురం, ఆత్మకూరు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే మొదటిరోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠంలో స్వామివారి పూర్వారాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి బృందావనానికి నిర్మల్య విసర్జన, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాది కైంకర్యాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అవధాని వాసుదేవశాస్త్రి ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- ఉప ఎన్నిక ప్రచారంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంపన్న



ఈ కొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న గంపన్న ఇతర నాయకులు

అనంతపురం క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మేయర్ గంపన్న పేర్కొన్నారు. కడప జిల్లా పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఆ మండలంలోని ఈ కొత్తపల్లి గ్రామ ఇన్‌చార్జిగా గంపన్నను పార్టీ అధిష్ఠానం నియమించింది. దీంతో ఆయన ఆదివారం ఆ గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేశారు. టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డిని భారీ మెజార్టీతో తెలిపించాలని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే.. చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. నాయకులు భూమిరెడ్డి రామసుబ్బారెడ్డి, ఉపేంద్ర రెడ్డి, చిన్న చంద్రాయుడు, అక్బర్‌బాబు పాల్గొన్నారు.

అభిమానులు, శ్రేణుల నడుమ..




ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కుటుంబ సభ్యులు

అనంతపురం క్రైం, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ పుట్టినరోజు వేడుకలు నగరంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ముందుగా ఎమ్మెల్యేకు స్థానిక నివాసం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. తర్వాత ఆయన రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న వెంకటేశ్వరస్వామి, కోర్టు రోడ్డులో ఉన్న వరదాంజ నేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. వరదాంజనేయ స్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. తర్వాత ఎమ్మెల్యే టీడీపీ కార్యాలయం వద్దకు వెళ్లగా అక్కడ పార్టీ నాయకులు గజమాలను క్రేన్ సాయంతో వేసి సత్కరించారు. అలాగే కేక్‌లు తీసుకొచ్చి కట్ చేయించారు. నగరంలోని 50 డివిజన్లు, 4 పంచాయతీల నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారందరి రాకతో ఆ ప్రాంతంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడి నెలకొంది.

ఎమ్మెల్యే పదవి చంద్రబాబు పెటిన భిక్ష: దగ్గుపాటి

జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు ఎమ్మెల్యే పదవి సీఎం చంద్రబాబు నాయుడు పెట్టిన భిక్ష అని అన్నారు. తాను ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కారణమన్నారు. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. దగ్గుబాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుమార్తె ఆశ్రిత నగరంలోని పలుచోట్ల అన్నదానం చేపట్టారు. టీడీపీ నాయకుడు నెట్టెం బాలకృష్ణ ఆస్పత్రి వద్ద రోగుల బంధువులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే సతీమణి శ్రీలక్ష్మి, కుమార్తె ఆశ్రిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, టీడీపీ నాయకులు రాయల్ మధు, జోగి రాజేంద్ర, రూపనగుడి రవి రాయల్ నగరంలోని పలు అనాథ ఆశ్రమాలతోపాటు ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. నారాయణపురం పంచాయతీ తపోవనంలో టీడీపీ నాయకులు డిష్ నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా చేశారు. ఎమ్మెల్యే సతీమణి శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ రామలక్ష్మి, నాయకులు రఘునాథ్, ఓబుళపతి, శారదా, వెంకట్రాముడు, వడ్డే హరి, మంద రమేష్, ఈశ్వరయ్య, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న నాయకులు గంగారామ్, సింగవరం రవి, ఓంకార్‌రెడ్డి

జిల్లా మహిళల క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ మహిళల క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం సెలెక్షన్స్ నిర్వహించారు. జట్టులో హరిత (కెప్టెన్), నేహ, గీతిక, ఛాయాశ్రీ, హస్సిరెడ్డి, చక్రిక, మాన్విత, హిమవర్షిణి, ధారామోహన్ (అనంతపురం), అర్షియానేహ, తేజశ్విని (కదిరి), మహిత (హిందూపురం), నందిని, అమూల్య, తరున్నమ్ బేగం (గుంతకల్లు), నాగజ్యోతి (ధర్మవరం)తోపాటు స్టాండ్‌బైలుగా చైత్ర, ఆంచల్‌యాదవ్, స్వాతి, కాత్యాయణి, అనూషాశ్రీ, కోచ్‌గా యమున ఎంపికయ్యారని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జి ల్లాకు పతకాలు దక్కా యి. గుంటూరు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో ఆదివారం 6వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్-2025 పోటీలు జరిగాయి. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 200మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. నగరంలోని ఏ1 చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు అండర్-14 ఓపెన్ విభాగంలో రన్నరప్‌గా జొన్నలగడ్డ నితీష్‌చౌదరి, అండర్-10 బాలికల విభాగంలో జనని 6వస్థానం, అండర్-6 బాలికల విభాగంలో వేదశ్రీ రెడ్డి 6వ స్థానం, అండర్-8 ఓపెన్ విభాగంలో అన్విత్ 10వ స్థానం, నిహాల్ నయనంజన్ 14వ స్థానంలో పతకాలు సాధించారు.

న్యూస్ బాక్స్

వైభవంగా రాఘవేంద్ర స్వామి ఆరాధన


కణేకల్లు, తాడిపత్రిలో అలంకరణలో బృందావనం

కణేకల్లు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మపురి శ్రీ నరసింహ స్వామి ఆలయంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి 354 ఆరాధన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన ఆదివారం పూర్వారాధనను వైభవంగా నిర్వహించారు. ఉదయం పంచమృతాభిషేకం, అర్చన, అష్టోత్తరం, నిర్వహించారు.

● తాడిపత్రి : స్థానిక శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి పూర్వారాధన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బృందావనానికి పంచామృతాభిషేకం, తులసీ అర్చన, హస్తోదకం, పాదపూజ, కనక మహాపూజ, రథోత్సవం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కసాపురం ఆలయ ఈఓగా విజయరాజు



గుంతకల్లు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా విజయరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ వాణి ఉరుకుంద వీరణ్ణ స్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఉరుకుంద వీరణ్ణస్వామి దేవాలయంలో ఈఓ విజయరాజు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

తాడిపత్రి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్‌కాలనీ లో ఉన్న పద్మవాణి హైస్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కృత్రిమ మేధ అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు. పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి దాదాపు 200మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు రమేష్‌నాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రంగస్వామి, భాస్కర్‌రెడ్డి, జ్యోతిలత, అనూరాధ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

పామిడి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనేపల్లికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త చలపతి అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతన్ని కుటుంబ సభ్యులు ఆదివారం అనంతపురం ఆసుపత్రి తరలించసాగారు. మార్గ మధ్యంలోనే తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మృతదేహానికి టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ నాయకులు ప్రభాకర్ చౌదరి, జింకల సంజీవకుమార్, సురేష్‌రెడ్డి, రామాంజనేయులు నాయక్ నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ. 10 వేలు అందజేశారు.

● రాయదుర్గంరూరల్: మండలంలోని రాయంపల్లిలో టీడీపీ నాయకుడు తిప్పేస్వామి (80) అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు పాల్గొన్నారు.

● కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చాకలి ఈశ్వరయ్య(51) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల మండల కన్వీనర్ లాలెప్ప, స్థానిక నాయకులు హనుమంతప్ప,ఎర్రిస్వామి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

భజన బృందాలకు బహుమతుల అందజేత

గుత్తిరూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువులో శనివారం రాత్రి జరిగిన రాష్ట్రస్థాయి భజనపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బొలికొండ రంగనాథ స్వామి కల్యాణాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈపోటీల్లో 12 భజన బృందాలు పాల్గొన్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఈ పోటీలు జరిగాయి. గుంతకల్లు మండలం గుర్రబాడుకు చెందిన లక్ష్మీ లక్ష్మీనరసింహస్వామి భజన బృందానికి మొదటి స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు బహుమతిని పొందారు. అలాగే పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లికి , వెంకటాంపల్లికి భజన బృందం రెండో, మూడు బమమతులను అందజేశారు. గుత్తి మండలం వన్నేదొడ్డికి చెందిన మారుతి భజన బృందానికి నాలుగో బహుమతిని అందుకన్నారు. అలాగే పోటీల్లో మిగిలిన భజన బృందాలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన రంగనాథ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం దేవస్థానంలో సంప్రదించాలని సూచించారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా గోపీనాథ్


గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్

గుంతకల్లుటౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో ఆదివారం సీపీఐ పట్టణ, మండల 14వ ప్రతినిధుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ హాజరయ్యారు. ఇందులో పట్టణ కమిటీని ఎంపిక చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శిగా సాకే గోపీనాథ్, సహాయ కార్యదర్శిగా ఎస్ఎండీ గౌస్‌ను ఎన్నుకున్నారు. వారు జగదీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వేములపాడు సొసైటీ చైర్మన్‌గా నాగమునిరెడ్డి



యాడికి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వేములపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్‌గా నాగమునిరెడ్డిని నియమించినట్లు సొసైటీ సెక్రటరీ గంగశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన తెలిపారు. డైరెక్టర్లుగా నగరూరు గ్రామానికి చెందిన వెంకట నరసింహులు, వేములపాడు గ్రామానికి చెందిన లక్ష్మీదేవిని నియమించినట్లు తెలిపారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రతాప్



గుత్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గుత్తి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా జక్కల చెరువు గ్రామానికి చెందిన గుర్రాల సూర్యప్రతాప్, వైస్‌చైర్మన్‌గా పామిడి పట్టణానికి చెందిన మాలిక్ బాషాతో పాటు కమిటీని ఏర్పాటు చేస్తూ ఎక్స్‌అఫీషియో రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు సభ్యులుగా ఓబయ్య, భారతి, హరికృష్ణ, నాగవీరమ్మ, సుబ్బలక్ష్మి, ఓబులేసు, లక్ష్మి, రంగారెడ్డి, నాగేశ్వరరావు, పెద్దయ్య, సరస్వతి, కృష్ణాబాయి, వెంకటేశును నియమించారు. వీరు త్వరలో ప్రమాణా స్వీకారం చేస్తారు.

నేలకూలిన మిద్దె

బెళుగుప్ప, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుడి గ్రామంలో శనివా రం రాత్రి కురిసిన వర్షానికి గంగమ్మకు చెందిన మిద్దె నేలకూలింది. మూడు రోజులు గా కురుస్తున్న వర్షాలకు పైకప్పు కూలి పడిపోయింది. ఇంట్లో నిద్రిస్తుండగా మట్టిపడుతుండడంతో అప్రమ త్తమైన గంగమ్మ, భర్త మల్లికార్జున ప్రాణాలతో బయటపడ్డారు.

జోరుగా వరి నాట్లు

● పుష్కలంగా సాగునీరు
● వ్యవసాయ పనుల్లో రైతుల బిజీబిజీ


వరి నాట్లు వేస్తున్న కూలీలు

బొమ్మనహాళ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ పరవళ్ల తొక్కుతోంది. పుష్కలంగా సాగునీటిని విడదల చేస్తున్నారు. బ్రాంచ్ కాలువల నుంచి మైనర్ కాల్వల వరకు నీటితో కళకళలాడుతున్నాయి. దాదాపు అన్ని కాలువలకు నీటిని సరఫరా చేస్తుండటంతో పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటికే వరి నారుమళ్లు పోసిన రైతులు వరి నాట్లు వేసుకోనేందుకు బిజిగా ఉన్నారు. రానున్న వారం రోజుల్లో వరినాట్లు పూర్తిస్థాయిలో ప్రారంభించనున్నారు. మండలంలోని ఉద్దేహాళ్, రంగాపురంక్యాంపు, క్రిష్టాపురం తదితర గ్రామాల్లో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. రెండు రోజులుగా వర్షలు కురుస్తుండంతో పంటలు సాగులో అన్నదాతలు తీరికలేకుండా ఉన్నారు. ట్రాక్టర్ల నిర్వాహకులకు చేతి నిండా పని లభిస్తోంది. వ్యవసాయ కూలీలకు పుష్కలంగా పనులు దొరుకుతున్నాయి. హెచ్చెల్సీకి సాగునీరు రావడంతో వరినాట్లు జోరందుకున్నాయి. దీంతో గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. కర్ణాటక ప్రాంతల నుంచి కూలీలను పిలిపించి నాట్లు వేయిస్తున్నారు. తక్కువ ఖర్చుతో నాట్లు వేస్తున్నా కూలీల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎకరా పొలం నాట్లు వేసేందకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ముందస్తుగా వర్షాలు రావడం తుంగభద్ర డ్యాం నిండుకోవడం ఎగువవకాలువకు నీరు ముందుగానే రావడంతో కొందరు రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటుండగా, మరి కొందరు నాట్లు సైతం పూర్తి చేశారు. మండలంలో వరి దాదాపు 15వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. ఈ నెలాఖరు నాటికి పూర్తిగా రైతులు వరిపంట నాట్లు వేసే అవకాశముంది.


ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

పూర్వ విద్యార్థుల ఔదార్యం

పామిడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న స్నేహితుడు శ్రీధర్ ఇటీవల పక్షవాతం వచ్చి బాధపడుతున్నాడు. ఇతను పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-1994 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివాడు. విషయం తెలుసుకున్న నాటి విద్యార్థులు ఆదివారం అతనికి ఇంటికి వెళ్లి రూ. 22 వేలు సాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మొక్కలు నాటిన పూర్వ విద్యార్థులు

ఉరవకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలంలో ఆదివారం కాళసముద్రం గురుకుల పాఠశాలకు చెందిన 1988 బ్యాచ్ విద్యార్థులు హెల్పింగ్ హ్యాండ్ అసోషిమేషన్‌గా ఏర్పడి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆదివారం మొక్కలు నాటారు. దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు 200 దాకా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓ రమేష్ బాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థులకు క్రీడాపోటీలు


క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులతో ట్రస్టు వ్యవస్థాపకులు, ఉపాధ్యాయులు

కుందుర్పి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండలంలోని విద్యార్థులకు ఆదివారం క్రీడాపోటీలు నిర్వహించారు. పిల్లలు పరుగుపందెం, స్కిప్పింగ్, కాలినడక, మ్యూజికల్ చైర్స్ పోటీలతో పాటు దేశభక్తిని ప్రేరేపించే పాటలు పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఇందులో ఆ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్ బాబు, ట్రస్టు సభ్యులు సాయి, చరణ్, శ్రీకాంత్ దిలీప్, ఉపాధ్యాయులు నింగప్ప, రఘు, హనుమంతరాయుడు, అనిత పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


గురుమూర్తిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ స్థానిక రామస్వామి వీధిలోని తన నివాసంలో ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్ గౌడ్, నాయకులు టీ కేశప్ప, కురుబ చంద్రశేఖర్, శ్రీరాములుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వర్షం వస్తే.. రోడ్డు బురదమయం


బండూరు-ఉద్దేహాళ్ రోడ్డు దుస్థితి

బొమ్మనహాళ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండూరు, ఉద్దేహాళ్ మధ్య ఉన్న నాలుగు కిలోమీటర్ల రోడ్డు చిన్నపాటి వాన వచ్చినా మొత్తం బురదమయంగా మారుతోంది. రోడ్డుపై నీరు నిలిచి కుంటను తలపిస్తోంది. ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ఈ రోడ్డుపై వెళ్లడానికి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మూడు రోజులగా వర్షవ వస్తుండడంతో ఈరోడ్డు పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. ఈ రోడ్డు బాగు కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెన్నసర్ల భవనం ప్రారంభం


మాట్లాడుతున్న విప్ కాలవ

రాయదుర్గం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెన్నసర్ల నూతన భవనాన్ని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదివా రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. పెన్నసర్లకు ఎల్లవేళలా తోడుగా ఉంటానన్నారు.కార్యక్రమంలో పెన్నసర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, తాలూకా అధ్యక్షుడు రామాంజినేయులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

కాలువ పనులు ప్రారంభం

పుట్లూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి బొప్పేపల్లి చెరువుకు ఉన్న కాలువలో ముళ్లకంపలు, పూడికతీత పనులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుబ్బరాయసాగర్ నుంచి బొప్పేపల్లి చెరువుకు 0.100 టీఎంసీల నీరు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిందని, దీంతో ఈ పనులు చేపట్టామని అన్నారు. ఈ సాగునీటిని సరఫరా చేసే కాలువను త్వరలో వెడల్పుగా చేస్తామని, చివరి ఆయకట్టు భూముల వరకు సాగు నీరు అందిస్తామని అన్నారు. పూడికతీత పనులకు కాంటినెంటల్ కాఫీ సంస్థ ఎండీ చల్లా రాజేంద్రప్రసాద్ రూ.2 లక్షలు సాయం అందించాలన్నా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా మరుగుదొడ్లు


నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఉరవకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు అలంకారప్రాయంగా మారాయి. శని, ఆదివారాల్లో ఈ ఆలయానికి వందల సంఖ్యలో భక్తులు వస్తూ ఉంటారు. మరుగుదొడ్లు లేకపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం రూ.7లక్షలు వెచ్చించి వీటిని నిర్మించినా... వాటిని వినియోగించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

విస్తారంగా వానలు


ఉధృతంగా ప్రవహిస్తున్న బండూరు వంక

బొమ్మనహాళ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగుతున్నాయి. పై ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో వేదావతి హగరికి భారీగా వరద నీరు వస్తోంది. కాగా, పలు పంట పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బండూరు గ్రామం వద్ద వంక ఎక్కువగా ప్రవహిచడంతో 15 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. బండూరు వద్ద వంతెన నిర్మించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రశ్నించడంతోనే ప్రగతి: జేవీవీ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ

రాయదుర్గం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నిత్యజీవితంలో సంఘటనలపై అవగాహన పెంచుకునేందుకు పరిశీలించేందుకు ప్రశ్నించడమే ప్రధానమని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక సమైఖ్యాంధ్ర భవనంలో ఆదివారం నిర్వహించిన జోనల్ స్థాయి మహాసభలో ఆయన మాట్లాడారు. దేనిని గుడ్డిగా నమ్మవద్దని, శోధన ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ముత్యాల సుధాకర్‌రెడ్డి, జేవీవీ స్టేట్ ఆడిట్ కన్వీనర్ సాకే భాస్కర్, జేవీవీ గౌరవ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, జేవీవీ సీనియర్ నాయకుడు కే వీరేష్, రాయదుర్గం అధ్యక్షుడు వీరన్న, కార్యదర్శి జగదీష్, శివానంద, నాగరాజు, తిప్పేస్వామి, మహేంతేష్ పాల్గొన్నారు.

ఆ సచివాలయానికి ఒక్కరే దిక్కు

సిబ్బంది లేక శ్రీధరఘట్ట గ్రామస్థుల పాట్లు


సచివాలయంలో ఉన్న మహిళా పోలీస్

బొమ్మనహాళ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలం లోని శ్రీధరఘట్ట గ్రామ సచివాలయంలో ఎనిమిది మంది సిబ్బందికి గాను కేవలం ఒకరు మాత్రమే ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్నా సిబ్బందికి ఐదేళ్లు పూర్తి కావడంతో బదిలీపై వెళ్లారు. దీంతో ఒక్క మహిళ పోలీసు మాత్రమే మిగిలారు. శ్రీధర ఘట్ట గ్రామ సచివాలయం పరిధిలో ఉప్పరాళ్, ఎల్బీనగర్, గౌనూరు గ్రామాలు ఉన్నాయి. సచివాలయంలో సిబ్బంది కొరత వల్ల వీరంతా పనులు కాక.. ఇబ్బందులు పడుతున్నారు. ఉద్దేహాళ్ పంచాయతీ కార్యదర్శి శివన్నకు శ్రీదరఘట్ట గ్రామ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇక్కడ అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన సంతకాలు కోసం పలుమార్లు ఫోన్ చేసినా అందుబాటలోకి రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ సచివాలయంలో సిబ్బందిని నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రైం న్యూస్..

చికిత్స పొందుతూ మహిళ మృతి


గంగమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త మనోహర్ భార్య గంగమ్మ (38) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది. ఈ నెల 2న మనోహర్, గంగమ్మ బైక్‌పై వెళ్తుండగా.. కిందపడటంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి చేర్పించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తక్షణ సాయం రూ. లక్ష నగదు సాయాన్ని అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కూడా ఎల్‌వోసీ ద్వారా రూ.4 లక్షలు దాకా ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఆమెను కాపాడేందుకు 10 రోజులు పాటు వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఆమె ఆదివారం మరణించింది. వారి కుటుంబానికి ఎమ్మెల్యే అమిలినేని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె పుట్టినిల్లు శెట్టూరు మండలం కనుకూరు గ్రామం. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆమె మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో రైతు మృతి


బొమ్మలింగ (ఫైల్)

కుందుర్పి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన రైతు బొమ్మలింగ (43) గుండెపోటుతో ఆదివారం మరణించాడు. బొమ్మలింగ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా ఒక్కసారిగా గుండెల్లో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. పక్క రైతులు ఆస్పత్రికి తరలించే లోపు మరణించాడు. బొమ్మలింగకు భార్య మంజుళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ శ్రేణుల దాడి


గాయపడిన టీడీపీ కార్యకర్త బసవరాజు

డీ.హీరేహాళ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లికేతిలో టీడీపీ కార్యకర్త బసవరాజుపై అదే గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. వ్యక్తిగత విషయమై వైసీపీకి చెందిన రామాంజిని, వన్నూరు స్వామి, వారి కుటుంబ సభ్యులు బసవరాజుపై ఆదివారం దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మల్లికేతి గ్రామానికి చేరుకొని ఘర్షణకు దిగిన ఇరువురిని చెదురగొట్టారు. గాయపడ్డ బసవరాజును బళ్లారి ఆసుపత్రికి తరలించారు. బసవరాజు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రస్తా విషయంలో ఘర్షణ

తాడిపత్రి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగినాయునిపల్లి గ్రామం వద్ద రస్తా విషయమై ఆదివారం జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారు. జోగినాయునిపల్లి గ్రామానికి చెందిన ఆదిశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి సంబంధించిన పొలంలో రస్తా ఉందని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దాదాపు 25 మంది రైతులు ఆదివారం రస్తా వేసే ప్రయత్నం చేశారు. దాన్ని ఆదిశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి అడ్డుకోబోయారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. బ్రాహ్మణపల్లి రైతులు రాళ్లతో దాడి చేయడంతో ఆదిశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీదేవి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెదరగొట్టి గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రస్తా విషయం ఏదైనా ఉంటే రెవెన్యూ ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప ఘర్షణలకు దిగరాదని ఇరువర్గాల వారినీ హెచ్చరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిప్పేస్వామి, శాంతికుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ జయనాయక్ తెలిపారు. ఆదివారం గ్రామంలో టమోటా బాక్సుల రైతులు వేసే సమయంలో వీరు గొడవ పడ్డారని, పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంట్లో చోరీ

కుందుర్పి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగుంపల గ్రామంలోని బోయ ఈరన్న ఇంట్లో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. బోయ ఈరణ్ణ, మౌనిక ఇంటికి తాళం వేసుకుని బంధువుల పెళ్లికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు శనివారం అర్ధరాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని రూ.50 వేలకు పైగా నగదు, ఆరు గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. పక్కింట్లో కూడా చోరీకి ప్రయత్నం చేయగా వారు గమనించి కేకలు వేయడంతో వారు పారిపోయారు. ఈరన్నకు సమాచారం అందించారు. వారు వచ్చి ఇంట్లో నగదు, నగలు పోయినట్లు గుర్తించి.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

తప్పిపోయిన బాలిక అప్పగింత


ఆర్తీని తండ్రికి అప్పగిస్తున్న సీఐ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ఉదయం తప్పిపోయిన ఓ బాలికను.. టూటౌన్ పోలీసులు ఆ బాలికను సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మహారాష్ట్రకు చెందిన ప్రకాష్ అనే వ్యక్తి పాత గుంతకల్లులోని మస్తానయ్య దర్గా ఉరుసులో అంగడిని ఏర్పాటు చేశారు. అతని కుమార్తె ఏడేళ్ల ఆర్తీ ఉదయం బస్టాండ్ సమీపంలో తప్పిపోయింది. దీంతో వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి 9గంటల ప్రాంతంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కొందరు మహిళలతో ఆర్తీ కనిపించడంతో సీఐ.. వారిని ప్రశ్నించారు. ఉదయం ఈ బాలిక ఏడుస్తూ కనిపించడంతో పిలిచి ప్రశ్నించామని.. ఆ బాలిక హిందీలో సమాధానం చెప్పడంతో అర్థం కాక ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టామని వారు సీఐ చెప్పారు. ఆమె దొరికిన ప్రదేశంలోనే విచారిస్తే ఆ బాలిక తల్లిదండ్రుల వివరాలు తెలుస్తాయని మళ్లీ ఆసుపత్రి వద్దకు తెచ్చామన్నారు. దీంతో సీఐ ఆ బాలిక తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ఆసుపత్రి వద్దకు రప్పించి వారికి అప్పగించారు. వారు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

రాయదుర్గంరూరల్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం తాలూకా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సోమశేఖర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధనుంజయ, ఉపాధ్యక్షుడిగా నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శిగా మహేష్, సంయుక్త కార్యదర్శిగా శ్రీదేవి, ట్రెజరర్‌గా కమలాక్షి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.


నూతన సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం